# అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసే బీఆర్ఎస్‌కు ఆదరణ

- మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

బీఆర్ఎస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 27: బీఆర్ఎస్ సర్కారు చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరును చూసే ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మంచిర్యాల పట్టణంలోని తొమ్మిదోవార్డు అండాళమ్మకాలనీకి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు 200 మంది శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్ ఆధ్వర్యంలో వీరంతా ఎమ్మెల్యే నివాసానికి చేరుకోగా వారికి ఎమ్మెల్యే దివాకర్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తామంతా ఈ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. జాఫర్‌నగర్‌కు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్ నాయకులు వదూద్, రాకేశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మూడోవార్డు తిలక్‌నగర్‌లో ఆ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు కర్రు శంకర్ ఆధ్వర్యంలో దాదాపు 200 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యేతో పాటు ఆయన తనయుడు విజిత్‌రావు పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదెసత్యం, నాయకులు పల్లపు తిరుపతి, రాకేశ్, తదితరులున్నారు.

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య
- సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం



లక్షెట్టిపేట : 4వ వార్డులో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, నాయకులు

మంచిర్యాల టౌన్ : మసీదువాడలో ప్రచారం చేస్తున్న హరికృష్ణ

లక్షెట్టిపేట, అక్టోబర్ 27: మున్సిపాలిటీలోని ప్రతి వార్డు అభివృద్ధి కావాలంటే అది కేవలం బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే సాధ్యమవుతుందని లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య అన్నారు. పట్టణంలోని 4వ వార్డులో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు గ్రామ పంచాయతీగా ఉన్న పట్టణాన్ని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి ప్రతి వార్డులో సీసీ రోడ్లను డ్రైనేజీలను ఏర్పాటు చేసిన వ్యక్తి మన ఎమ్మెల్యే దివాకర్‌రావు అని కొనియాడారు. మరింత అభివృద్ధి సాధించాలంటే బీఆర్ఎస్‌కు మద్దతుగా నడిపెల్లి దివాకర్‌రావును ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు సురేశ్ నాయక్, ఓరుగంటి శ్రీకాంత్, మెట్టు కల్యాణి రాజు, కోఆప్షన్ సభ్యులు షాహెద్‌అలీ, నూనె ప్రవీణ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, జిన్ని వెంకటేశ్, పెండెం రాజు తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి చేసిన వారినే ఆదరించండి

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 27: అభివృద్ధి చేసిన వారిని గుర్తించి వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్, ఐదోవార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని ఐదోవార్డు మసీదువాడ, సాయికుంట ప్రాంతాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు తరపున ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు కారు గుర్తుకే ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు షేక్ బాబా, యూత్ అధ్యక్షుడు ప్రశాంత్, ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ ఆవునూరి రవి, ఎర్రోళ్ల శ్రీనివాస్, దామోదర్, కడమళ్ల నర్సయ్య, అంజిరెడ్డి, అమ్జద్, చిట్టిబాషా, తదితరులున్నారు.

# కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలపై నిరసన

- దండేపల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు, రైతుల రాస్తారోకో

దండేపల్లి, అక్టోబర్ 25 : కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దండేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో చేశారు. రైతు బంధు ఆపాలని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం రైతులను నిండా ముంచినట్లేనని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రైతులు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, వైస్ చైర్మన్ అక్కల రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బండారి మల్లేశ్, పట్టణ అధ్యక్షుడు సత్యం, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

దండేపల్లిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

హాజీపూర్, అక్టోబర్ 27 : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంచిర్యాలలోని ఎస్ఆర్ఆర్ కాలేజ్, మౌంట్ కార్మెల్ స్కూల్ గుడిపేటలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'యూస్ యాప్ టెక్నాలజీ ఫర్ ఎఫెక్టివ్ పోలిసింగ్'పై విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ సయ్యద్ జమీల్ భాష, ఆర్ఐలు కుమార స్వామి, శ్రీనివాస్, గోపి, మారుతి, ఆర్ఎస్ఐలు రాజ శేఖర్, శేఖర్, ఉపాధ్యాయులున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 27: మంచిర్యాల పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 28న ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ 2 ఏఈ జాన్ తెలిపారు. ఏసీసీ, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో అంతరాయం ఉంటుంది.

## వాతావరణ మార్పుల దృష్ట్యా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

- డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

మంచిర్యాల ఏసీసీ, అక్టోబర్ 27: రెండు రోజులుగా మారుతున్న వాతావరణం దృష్ట్యా ప్రజలందరూ పలు జాగ్రత్తలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు అన్నారు. శుక్రవారం ఐటీవోసీ కార్యాలయంలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. నీటిని పొదుపుగా వాడుతూ పరిసరాలను కాపాడుకోవాలన్నారు. ప్లాస్టిక్‌ను కాల్చడం ద్వారా వాయు కాలుష్యం ఏర్పడుతుందన్నారు. సొంత పనులకు వాహనాలను వాడకుండా సైక్లింగ్, నడకకు ప్రాధాన్యమివ్వాలన్నారు. రెండు రోజుల పాటు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్వో ఫయాజ్, డా.శివ ప్రసాద్, సీహెచ్‌వో లింగారెడ్డి, డెమో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో

## గుడుంబా రవాణా చేస్తున్న ఇద్దరిపై కేసు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 27 : పట్టణంలోని అండాలమ్మ కాలనీలో ద్విచక్ర వాహనాల ద్వారా గుడుంబా తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు మంచిర్యాల ఎక్సైజ్ సీఐ నరేందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. మందమర్రి మండలం పులిమడుగుకు చెందిన బొల్లెన దినేష్, బొల్లెన రాకేష్‌లు ద్విచక్ర వాహనాల మీద 16 లీటర్ల గుడుంబాను మంచిర్యాలకు తరలిస్తుండగా అండాలమ్మ కాలనీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు సీఐ వెల్లడించారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై జీవన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి, సిబ్బంది ప్రసాద్, రాజేంద్రప్రసాద్, సరిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## గూడెం వద్ద తనిఖీలు

దండేపల్లి, అక్టోబర్ 27 : దండేపల్లి మండలంలోని గూడెం చెక్‌పోస్ట్, తాళ్లపేట వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్ వద్ద లక్షెట్టిపేట సీఐ కృష్ణ, దండేపల్లి ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీ చేపట్టారు. వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ, వివరాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

## ఎఫ్‌సీఐని తనిఖీ

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 27 : పట్టణంలోని భారత ఆహార సంస్థను శుక్ర వారం సాయంత్రం సంప్రదింపుల కమిటీ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్వాలిటీ విషయంలో నాణ్యత పాటించడం లేదని, అధికారులు, రైస్‌మిల్ యాజమానులు కుమ్మక్కై ఎఫ్‌సీఐని మోసం చేస్తున్నారని సభ్యులు బుర్ర సురేందర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తిరుపతి, సీతారాం, చంద్రమోహన్ గౌడ్, రిజ్వాన్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలి

- ఆ పార్టీ నాయకుల డిమాండ్

మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ

బెల్లంపల్లి, అక్టోబర్ 27 : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అమరాజుల శ్రీదేవి అభ్యర్థిత్వాన్ని మార్చాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బొల్లెడ కేశవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, జిల్లా కార్యదర్శి కొయిల్కర్ గోవర్ధన్, సీనియర్ నాయకులు అజ్మీరా శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో బలహీనంగా ఉన్నా బీజేపీ బలోపేతం చేశామని గుర్తు చేశారు. నెలరోజుల క్రితం పార్టీలో చేరిన శ్రీదేవికి టికెట్ ఏ ప్రాతిపదికన ఇచ్చారో అధిష్టానం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకత్వం చర్యలతో పార్టీకి నష్టం కలుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే టికెట్ ఏమాజీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు దూది ప్రకాష్, సోమన్న, ప్రభాకర్, శ్రావణ్‌కుమార్, నర్సింగ్, దశరథం, దుర్గం లక్ష్మణ్, స్వామి, సుభాష్, అజ్మీరా తదితరులు పాల్గొన్నారు.

## నెన్నెల పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

నెన్నెల,అక్టోబర్27: పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా నెన్నెల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్ఐ పుప్పాల శ్యామ్ పటేల్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో విధులు, సేవలు, ఆయుధాల పని తీరుపై పాఠశాలల విద్యార్థులకు వివరించారు.

**కన్నెపల్లిలో..**

కన్నెపల్లి, అక్టోబర్ 27 : పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కన్నెపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కన్నెపల్లి పోలీసులు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయుధాల పని తీరు, పోలీస్‌స్టేషన్ నిర్వహణ, విధులపై ఎస్ఐ నరేశ్ వివరించారు.

## యోగా జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 27 : పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ యోగా అండర్ – 14, 17 బాల బాలికల ఎంపిక పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పరిమల తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 28న ఆదిలాబాద్‌లో జరిగే జోనల్ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారన్నారు. జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన డీఈవో యాదయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పద్మావతి, సూరం రవి, శివ నూరి, తిరుపతి, పద్మ, అలేఖ్య తదితరులున్నారు.